

# రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080



ప్రచురణ : అనంతపురం/శ్రీసత్యసాయి | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | మంగళవారం 22 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 01, సంచిక : 01 | పేజీలు : 04, వెల రూ.2




**ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు**

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

## వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

**ఇక అప్పులపైనే ఆధారపడం**

కీలక ప్రాజెక్టులకు నిధుల కోసం ప్రైవేటు పెట్టుబడులపై దృష్టిపెడతాం...

పెట్టుబడిదారుల నష్టభయం తగ్గించేలా ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తాం

30 వేల ఎకరాల్లో నెట్--జీరో మెగాసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ



న్యూఢిల్లీ: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం మిగతా 2 లో

## పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్

**సొంత నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పర్యటన..**

రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్సుకు శ్రీకారం

మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ

తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన



అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని మిగతా 2 లో



**దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి**

**రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ సవాల్**

- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం
- ప్రకృతి కావాల్సినన్ని నీళ్ళు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు"
- అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలి

## 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలి


**పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు**

- ★ ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు: మంత్రి లోకేశ్ నిర్ణయాలు
- ★ లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- ★ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో మిగతా 2 లో

**తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు అప్రమత్తం**



- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

**ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ**




- ఏపీలో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు రైల్వే శాఖ సన్నాహాలు
- పశ్చిమ, మధ్య భారతం నుంచి ఏపీ పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం
- రాయలసీమ నుంచి పోర్టులకు దూరం తగ్గించేలా కీలక ప్రతిపాదనలు

**మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు**



- కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదు
- మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?"



**అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం**

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

**ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది**



- భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత
- మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: ప్రజలను కోరిన సీఎం రేవంత్

## జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

**వైఎస్ జగన్ వార్నింగ్‌తో దిగొచ్చిన చంద్రబాబు**

- ➤ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం
- ➤ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్



విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో కదలిక కనిపించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన సీఎం.. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించనున్నట్లు శనివారం స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతుల సమస్యలు, మిగతా 2 లో

రాయలసీమ దరువు APTEL/26/A7874 www.rayalaseemadaruvu.com తెలుగు దినపత్రిక



## యెమెన్‌లో భీకర పోరు.. 24 గంటల్లో 44 మంది మృతి

ఢిల్లీ: యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్-కదా, అల్-వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మరోవైపు, లహిజ్ ప్రావిన్సులో వ్యూహాత్మకంగా కీలకమైన బాబ్ అల్-మండెబ్ జలసంధి సమీపంలోని కహబూబ్ పర్వత ప్రాంతం స్వాధీనం కోసం జరిగిన పోరులో 12 మంది సైనికులు, ఒక కమాండర్‌తో సహా 15 మంది హౌతీ తిరుగుబాటుదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల ఆరంభంలో హౌతీ రెబల్స్ కీలకమైన మోఖా నౌకాశ్రయంతో పాటు బాబ్ అల్-మండెబ్ జలసంధిలోని మయూన్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు పక్షాలు ఎర్ర సముద్ర మార్గంలోని వివాదాస్పద ప్రాంతాలకు భారీగా బలగాలను తరలిస్తున్నాయి. 2014లో హౌతీలు రాజధాని సనాతో పాటు దేశంలోని ఉత్తర ప్రాంతాలను ఆక్రమించడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. అనంతరం 2015లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగాయి. అప్పటి నుంచి దేశంలో ఘర్షణలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

## సౌదీకి సాయం చేస్తే ఉక్కు పిడికిలితో బదులిస్తాం
## పాక్, టర్కీకి హౌతీల హెచ్చరిక

ఢిల్లీ: యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్, టర్కీ దేశాలకు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సౌదీ అరేబియాకు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా 'ఉక్కు పిడికిలి'తో బదులిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. "దేవుడి సాక్షిగా చెబుతున్నా.. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతాం" అని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధం లేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు "మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్"పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

## దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

వనపర్తి జిల్లా: కాంగ్రెస్ నేతలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని.. దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలన్నారు. శనివారం ఆయన వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమంటూ తేల్చి చెప్పారు. "ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్న కేటీఆర్.. నీళ్లు ఇవ్వకపోతే గల్లా పట్టుకుని అడుగుతామన్నారు. తాము తప్పు చేశామని తేలితే చర్యలు తీసుకోండి.. అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలన్నారు. రైతులు విద్యుత్, సాగునీటి కష్టాలు చెప్పుకున్నారు.. ప్రకృతి కావాల్సినన్ని నీళ్ళు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు. "ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సామర్థ్యం ఉండేది. 24 వేల మెగా వాట్లకు విద్యుత్ సామర్థ్యం పెంచినం. అత్యల్పంగా కృష్ణా నీళ్లను తెలంగాణ వాడుకుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముప్పై శాతం కంటే ఎక్కువ నీళ్లు వాడుకున్నాం. పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్ట్‌లుగా మార్చినం. ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. వరద వస్తుందంటే వెంటనే నీళ్లు మళ్లించే వాళ్లం. ..చెక్ డ్యామ్‌లు, చెరువులు నింపి పాలమూరులో నీళ్లు ఇచ్చాం. రెండు సబ్ స్టేషన్‌లకు రైతులతో కలిసి వెళ్ళాం. అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావట్లేదని రైతులు చెప్తున్నారు. లో వోల్టేజ్, తరచూ కట్ చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని అంటున్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోతుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విద్యుత్ కష్టాలు, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెప్తున్నారు. అన్ని ఉన్నప్పటికీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించే లక్ష్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానిస్తూ, ముఖ్యంగా ప్రధాన ఓడరేవులను కలుపుతూ మొత్తం 9 కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. మధ్య, పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులకు నేరుగా కనెక్టివిటీని పెంచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రయాణ దూరంతో పాటు సరుకు రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. రాయలసీమ, దక్షిణ ప్రాంతాల నుంచి ఓడరేవులకు అనుసంధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 120 కిలోమీటర్ల పొడవైన రాజంపేట - నెల్లూరు రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ఇది రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు నేరుగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, 41.5 కిలోమీటర్ల మేర గూడూరు - దుగరాజపట్నం పోర్టు లైన్‌కు సంబంధించి తుది లొకేషన్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. 88.3 కిలోమీటర్ల పుత్తూరు - అత్తిపట్టు మార్గం చెన్నై ఓడరేవులకు దూరాన్ని తగ్గిస్తుండగా, దీనికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమవుతోంది. ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల కనెక్టివిటీకి కూడా రైల్వే శాఖ ప్రాధాన్యమిచ్చింది. 150 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన చింతూరు - సామర్లకోట రైల్వే లైన్ ద్వారా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కాకినాడ పోర్టుతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. అదేవిధంగా, ఇప్పటికే మంజూరైన ఒడిశాలోని తెరుబాలి - గుణుపూర్ (73.6 కి.మీ) లైన్ ములపేట పోర్టుకు సరుకు రవాణాను మరింత సులభతరం చేయనుంది. వీటితో పాటు, తెలంగాణ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రైలు మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేలా 290 కిలోమీటర్ల పొడవైన సికింద్రాబాద్ - శ్రీశైలం - మార్కాపురం లైన్ కూడా ప్రతిపాదనల్లో ఉంది. గద్వాల - మాచర్ల (184.2 కి.మీ), దొనకొండ - ఒంగోలు (119.6 కి.మీ), దూపాడు - బేతంచెర్ల (53.9 కి.మీ) లైన్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మార్గాలు దొనకొండ, ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతాలను ఓడరేవులతో అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాష్ట్ర వాణిజ్య, ఆర్థిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతాయని భావిస్తున్నారు.

# వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

న్యూఢిల్లీ: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ'సదస్సులో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, ఇతర కీలక ప్రాజెక్టుల కోసం ఇకపై ప్రైవేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్‌ను భారీగా సమీకరించే నమూనా వైపు రాష్ట్రం దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్?కను తగ్గించడానికి, వయబిలిటీ గ్యాప్ పూడ్చడానికి ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ మార్గాలను మరింత బలోపేతం చేస్తామని భట్టి వివరించారు.

వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న వికసిత్ భారత్ ప్రయాణంలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2025--26 నాటికి తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇది 10.7 శాతం వృద్ధి అని.. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండి రూ. 4,18,931కి చేరిందని భట్టి గుర్తుచేశారు. ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వివరించారు. రాష్ట్ర సమతుల్య అభివృద్ధి కోసమే క్యూర్, ప్యూర్, రేర్ అనే ప్రత్యేక నమూనాను అమలు చేస్తున్నట్లు భట్టి వివరించారు. అలాగే దేశంలోనే తొలి నెట్--జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 30 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి వెల్లడించారు.

### యువతే తెలంగాణ అసలైన బలం...

రాష్ట్ర యువతే తెలంగాణ అసలైన బలమని భట్టి పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. సామాజిక భద్రత, మెరుగైన వైద్యం, మహిళా సాధికారతతో కూడిన సమ్మిళిత అభివృద్ధే రాష్ట్ర విధానమని భట్టి వివరించారు.

## జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో కదలిక కనిపించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన సీఎం.. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించనున్నట్లు శనివారం స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతుల సమస్యలు, సాగునీటి కొరత, వ్యవసాయ సంక్షోభంపై వైఎస్ జగన్ ఈ నెల 17న పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్లతో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. కరువు మండలాలను ప్రకటించకపోతే ఉద్యమిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

వైఎస్ జగన్ ఫైర్

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, సాగునీటి కొరత, వ్యవసాయ సంక్షోభంపై జగన్ సమీక్షించారు. కరువు కాలంలో రైతులను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఎల్‌నినో కంటే 'ఎల్లో నినో'తోనే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందంటూ చంద్రబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జూన్ నుంచి వర్షపాతం లోటు కొనసాగుతున్నప్పటికీ కరువు మండలాలను ప్రకటించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే సాగు గణనీయంగా తగ్గిందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు ప్రకటన

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించారు. సెప్టెంబర్ 24 నాటికి జిల్లా స్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సెప్టెంబర్ 29 నాటికి రాష్ట్రస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించాలని సూచించారు. రాష్ట్రంలో 513 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. పంటల పరిస్థితి, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.

హైరిస్క్ కేటగిరీలో 1,357 ఆర్ఎస్‌కేలు

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పరిస్థితులపై ప్రభుత్వం రిస్క్ ఆధారిత అంచనాలు చేపట్టింది. 1,357 రైతు సేవా కేంద్రాల పరిధిలో పంటలను హైరిస్క్ కేటగిరీలో గుర్తించినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఖరీఫ్‌లో వర్షపాతం లోటు నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు పంటల పరిస్థితిని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### తాగునీటి సమస్యపైనా సమీక్ష

ఇదిలా ఉండగా.. సాగుతో పాటు తాగు నీటి విషయంలోనూ జగన్ వార్నింగ్ పని చేసింది. విశాఖపట్నంలో తాగునీటి సమస్యపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులతో పాటు తాగునీరు, సాగునీటి లభ్యతపై కూడా అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

## మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మోటకొండూరు: కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?" అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారని విమర్శించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సాధారణ యువతకు లబ్ధి చేకూరలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదని ఆక్షేపించారు. " కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు. మీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? ఇక్కడ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంపీలు దిల్లీలో కొట్లాడాలి. మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి" అని హరీశ్‌రావు అన్నారు.

తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?: ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

కాంగ్రెస్ నేతలు ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?అని ప్రశ్నించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూముల పరిశీలనకు వెళ్లడంపై ఆయన మండిపడ్డారు. దాడులు చేస్తామన్నవారిని బందోబస్తుతో పంపిస్తున్నారని, తాము నిరసన చేస్తామంటే ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని ఆక్షేపించారు. ఫాంహౌస్‌ల చుట్టూ తిరుగుతున్న వారిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదని ప్రశ్నించారు.

## పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్



అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

మూడు ప్యాకేజీల్లో పనులు

విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలి



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు అప్రమత్తం



హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం: హరీశ్ రావు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళు న్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. "కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

రాయలసీమ దరువు APTEL/26/A7874
మంగళవారం 22 సెప్టెంబరు 2026

# మడకశిరలో నూతన రైతు బజార్ నిర్మాణానికి భూమిపూజ



మడకశిర,సెప్టెంబర్ 21, రాయలసీమ దరువు న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లాలో రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదు-పాయాలు కల్పించడంలో భాగంగా మడకశిర నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ సమీపంలో నూతన రైతు బజార్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సీయస్ ర్ నిధుల ద్వారా రైతు బజార్‌ను నిర్మించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ భూమిపూజ నిర్వహించారు. మడకశిర లో రైతు బజార్ అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల రైతులు తమ పంటలను నేరుగా రైతు బజార్ కు తీసుకువచ్చి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారులకు నేరుగా విక్రయించుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం, వినియోగదారులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించే అవకాశం ఏర్పడుతుంది. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు,రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,ఏడీ మార్కెటింగ్ శ్రీ సయ్యద్ హఫీజుల్లా,సహాయ కార్యదర్శి కేదార్ నాథ్,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ గురుమూర్తి, మార్కెట్ కమిటీ సభ్యులు,మార్కెట్ కమిటీ సిబ్బంది కుళ్ళయప్ప యాద అసిస్టెంట్ శ్రీరాములు రాజశేఖర్ జాప్రతినిధులు,రైతు ప్రతినిధులు,సంబంధిత అధికారులు,రైతులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఏపీకే ఫైల్స్‌పై అవగాహన

# అనధికార ఫైళ్లను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయవద్దు

## మొబైల్ ఫోన్ వినియోగంపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

నంబులపూలకుంట, సెప్టెంబర్ 21,రాయలసీమ దర-ువు న్యూస్:నంబులపూలకుంట మండల పరిధిలోని ఎదురుదొన గ్రామం సిద్ధవాండ్లపల్లిలో సోమవారం ఏపీకే ఫైల్స్ (ఏపీకే ఫైల్స్), సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ భారత్ జీ రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్ మహేంద్ర నాయుడు,సిఎఫ్ఎల్ కౌన్సిలర్ నారాయణ ఆధ్వర్యంలో వర్కర్లకు ఆర్థిక అక్షరాస్యతతో పాటు సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఎఫ్ఎల్ కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు సామాజిక భద్రత పథకాల్లో నమోదు చేసుకోవడంతో పాటు పొదుపు ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. బ్యాంకు ఖాతాల



రకాలు,వాటి వినియోగం,ఆర్థిక లావాదేవీల సమ-యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాట్సాప్ గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే అనధికార ఏపీకే ఫైల్స్‌ను ఎట్టి పరిస్థిత-ుల్లోనూ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయవద్దని సూచించారు. ఆఫర్లు, బహుమతులు,ఇతర ఆకర్షణీయ-ంమైన సందేశాల పేరుతో వచ్చే ఫైల్స్ పట్ల అప్రవ-ంత్తంగా ఉండాలని తెలిపారు. ఇలాంటి ఫైల్స్ ద్వారా మొబైల్ ఫోన్‌లో వైరస్‌లు చొరబడటంతో పాటు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఇతర సున్నితమైన సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫైల్స్, లింకులను తెరవకూడదని, అనుమానాస్పద ఏపీకే ఫైల్స్‌ను ఇతరులకు ఫార్వర్డ్ చేయకూడదని సూచించారు. తెలియని యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకుండా, సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రవ-ంత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ ఉత్సవాల ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ

పుట్టపర్తి,సెప్టెంబర్, 21, రాయలసీమ దరువు న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు 'అంగన్‌వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన ముందస్తు ప్రచార పోస్టర్లను సోమవారం రెవెన్యూ భవన్, పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్,జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య మరియు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల లతో కలసి ఆవిష్కరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం, ముందస్తు ప్రాథమిక విద్య ప్రాముఖ్యతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. పోషణ రహిత సమాజ స్థాపనకు పోషకాహారం ఎంత కీలకమో ప్రజలకు వివరించడం. 13 రోజుల పాటు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆటపాటలు, ఆరోగ్య తనిఖీలు, పౌష్టికాహార ప్రదర్శనలు మరియు గర్భవతులకు సీమంతాలు వంటి పలు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయా సిబ్బంది,ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఈ అవగాహన సదస్సులు మరియు ఉత్సవాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు,జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకూడదు - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, సెప్టెంబర్ 21 రాయలసీమ దరువు : అనంతపురం జిల్లాలో ఎక్కడ కూడా మంచి నీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తాసిల్దార్ లు, ఎంపీడీవోలు ఏపీవోలతో మంచినీటి సమస్య, వ్యవసాయం, అక్షరాస్యత, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు మంచినీటి సమస్య ఉందని ఎక్కడైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే 24 గంటల లోపల సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి సమస్యను సీరియస్ గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎల్ నినో సమస్యను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు పంటలు సాగు చేసే విధంగా చూడాలని వ్యవసాయ శాఖ జెడిఎ కు సూచించారు.



ఎల్ నినో సమస్యను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్స్ సమన్వయంతో పనిచేయాలన్నారు.


ప్రతి పౌరుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం "ఉల్లాస్ -- అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు వయోజన విద్య అధికారులు సిబ్బంది వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి 100% అక్షరాస్యత శాతాన్ని సాధించాలన్నారు. కొంతమంది వాలంటరీలు గౌరవ వేతనం లేకుండానే నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద వేతనదారులు, డిఆర్డిఏ పరిధిలోని మహిళలు, మెప్మా పరిధిలోని పొదుపు సంఘాల నిరక్షరాశులను గుర్తించి విద్యావంతులుగా మార్చాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిఆర్డిఏ పిడి శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలు రెడ్డి, డ్వామా పిడి, ఏపీఎంఐపి పిడి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్తచెరువులో రోడ్డు విస్తరణకు విద్యుత్ లైన్ల మార్పిడి పనులకు శ్రీకారం



కొత్తచెరువు,సెప్టెంబర్ 21,రాయలసీమ దరువు న్యూస్: కొత్తచెరువు పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న విద్యుత్ లైన్ల మార్పిడి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన విద్యుత్ లైన్ల మార్పిడి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

# అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



రాయదుర్గం,సెప్టెంబర్ 21,రాయలసీమ దరువు న్యూస్: రాయదుర్గం తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ (సీపీఐ) ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అనంతపురం జిల్లా కన్వీనర్ డాక్టర్ బి. వెంకటరమణ బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దీక్షకు కూర్చున్న నాయకులకు, రైతులకు తన పూర్తి మద్దతును ప్రకటించారు. దీక్షా శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కరువు కారణంగా రైతాంగం కోలుకోలేని విధంగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ప్రభుత్వం స్పందించి తగిన ప్యాకేజీని ప్రకటించి రైతులను ఆదుకోవాల్సిన ప్యాకేజీని ప్రకటించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ చేస్తున్న ఈ పోరాటం అత్యంత న్యాయమైనదని, రైతులకు న్యాయం జరిగే వరకు తాము కూడా కలిసి పోరాడుతామని ఈ సందర్భంగా డాక్టర్ బి. వెంకటరమణ బాబు పేర్కొన్నారు.

# ఆర్ఎంపి వైద్యుడు శివారెడ్డి మృతి

**నివాళులర్పించిన ఆర్.ఎం.పి నల్లమాడ యూనియన్ వైద్యులు**



నల్లమాడ,సెప్టెంబర్ 21,రాయలసీమ దరువు న్యూస్:సత్యసాయి జిల్లా,నల్లమాడ మండలం గోపేపల్లి కి చెందిన ఆర్ఎంపీ వైద్యులు సంటిమాల శివారెడ్డి(76) కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ 17వ తారీఖు పుట్టపర్తి సూపర్ హాస్పిటల్ చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఉదయం 2.30 నిమిషాలకు మృతి చెందారు,అతనికి భార్య పద్మావతి,కుమారుడు అమర్నాథ్ రెడ్డి,కుమార్తె కలరు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన గోపే పల్లికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న నల్లమాడ ఆర్ఎంపి యూనియన్ నాయకులు శివారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు,ఆర్.ఎం.పి యూనియన్ నాయకులు మోహన్ రెడ్డి,అబ్దుల్ రసూల్,మోతిలాల్ నాయక్,సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను కలిసిన వన్ టౌన్ నూతన సిఐ కరుణాకర్



అనంతపురం, సెప్టెంబరు 21 రాయలసీమ దరువు : అనంతపురం వన్‌టౌన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా పోలీసు శాఖ సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజల్లో పోలీసు శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సిఐ కరుణాకర్ కు సూచించారు.

# సార్ పోలీస్ డిపార్ట్మెంట్ పేరుచెప్పి బెదిరిస్తున్నారు..

- మా స్థలాన్ని ఆక్రమించుకొని మమ్మల్నే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు..
- కావాలనే ప్రతిరోజూ ఏదో ఒక గొడవపెట్టుకుంటున్నారు
- మాకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కు ఫిర్యాదు చేసిన గొల్ల శిరీష



అనంతపురం, సెప్టెంబర్ 21 రాయలసీమ దరువు : సార్.. మా స్థలాన్ని ఆక్రమించుకొని మమ్మల్నే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రతి రోజూ ఏదో ఒక గొడవపెట్టుకుంటూ, మాకు చాలా ఇబ్బంది పెడుతున్నారని గొల్ల శిరీష పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా అనంతపురం నగరంలోని అరవింద నగర్, మిస్సమ్మ స్థలం పక్కన ఉన్న ఇంటి నెంబర్ 11/390 నందు, కాపురముంటున్నామన్నారు. అయితే 6 నెలల క్రితం మా పక్కింటిని అనంతమ్మ అనే మహిళ కొన్నదని, వాళ్లు ఇప్పుడు ఇల్లు కట్టుకుంటూ మా స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా, పోలీస్ డిపార్ట్మెంట్ పేరుచెప్పి ఎవరినో పిలిపించి బెదిరిస్తున్నారని వాపోయారు. మేము ఇది సరైనది కాదని ప్రశ్నిస్తే, వారందరూ కలసి మమ్మల్ని బూతులు తిడుతూ మాటి మాటికి కంప్లైంట్ ఇస్తూ, పోలీస్ స్టేషన్ కు పిలిపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మాతప్పు లేకపోయినా మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారనీ, దయచేసి మాకు న్యాయం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యేని కలిసిన వన్ టౌన్ నూతన సీఐ కరుణాకర్



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
అనంతపురం వన్‌టౌన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా పోలీసు శాఖ సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజల్లో పోలీసు శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సిఐ కరుణాకర్‌కు సూచించారు.

మూఢనమ్మకాలు, దురాచారాలపై..

## చైతన్యం కల్పించిన గురజాడ

- గురజాడ అప్పారావుకు ఘనంగా నివాళి : సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
అనంతపురం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల తదితర అధికారులతో కలిసి పాల్గొని గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు అందించిన విశిష్ట సేవలను వారు స్మరించుకున్నారు. జేసి మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలను తన రచనల ద్వారా ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం కల్పించిన గురజాడ అప్పారావు సాహితీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేస్తూ వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడంలో గురజాడ అప్పారావు కృషి విశేషమైనదని తెలిపారు. ఆయన రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమణ రెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ అలెగ్జాండర్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, రియాజ్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎండీఎస్‌తో తేమను కాపాడుకుంటూ సాగు

కోటంకలో 70 ఎకరాల సిట్రస్ కాంపాక్ట్ బ్లాక్ పరిశీలన



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
ఎల్‌నినో పరిస్థితుల్లో తక్కువ వర్షపాతం నమోదవుతున్నప్పటికీ భూమిలో తేమను కాపాడుకుంటూ సాగును కొనసాగించేందుకు పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానం ఉపయోగపడుతుందని ఆర్‌వైఎస్‌ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ (రిటైర్డ్), జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన 70 ఎకరాల పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ సిట్రస్ కాంపాక్ట్ బ్లాక్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, పీఎండీఎస్ ద్వారా సాగు చేస్తున్న విధానం, వర్షపాతం, భూమిలో తేమ నిల్వ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితుల్లో తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ ద్వారా సాగును కొనసాగించడం అభినందనీయమన్నారు. భూమిలో తేమను సంరక్షించుకుంటూ పంటల వైవిధ్యంతో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితుల్లో పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ రైతులకు భరోసాగా నిలుస్తుందన్నారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ ద్వారా పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులను సూచించారు. ఈ కాంపాక్ట్ బ్లాక్ ఏర్పాటుతో స్ఫూర్తి పొందిన 30 మంది రైతులు 150 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ చేపట్టేందుకు ముందుకు వచ్చారు. అనంతరం మరో నాలుగు ఎకరాల్లో కాంపాక్ట్ బ్లాక్‌లో పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ విత్తన గుళికలతో విత్తనాలు వేశారు. వర్షపు నీటిని సమర్థంగా వినియోగించుకోవడం, భూమిలో తేమను నిలుపుకోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం, ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా సాగు చర్యలు చేపట్టడంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిటీఐఓ లక్ష్మానాయక్, ఎస్పీఎం డా. నవీన్, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ వెంకట్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఉద్యాన అధికారి రత్నకుమార్, పశువైద్యాధికారి డా. రమేష్, ఏపీఓ ఒబన్న, ఎఫ్‌ఎంటీ నందిని, ఏఈఓ సూర్య హరిబాబు, వీఏఏ అశ్విని, ఏహెచ్‌ఏ, టెక్నికల్ అసిస్టెంట్లు, రైస్స్ సిబ్బంది, మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, రైతులు జయరాములు, సుబ్బయ్య, కృష్ణయ్య, మహిళా రైతులు మానస, నందిని తదితరులు పాల్గొన్నారు.

## కణేకల్లు సబ్‌రిజిస్ట్రార్ బసవరాజు సస్పెన్షన్



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
కణేకల్లు మండల సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న బసవరాజును సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసినట్లు మాధ్యమాల్లో హల్ చల్ అవుతోంది. 2023-24 మధ్యకాలంలో తాడిపత్రి మండలం వీరాపురం గ్రామానికి చెందిన అసైన్డ్ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిర్వహించిన వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు తెలిసింది. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై శాఖాపరంగా పరిశీలన చేపట్టిన అధికారులు, సంబంధిత వ్యవహారంలో సబ్‌రిజిస్ట్రార్ బసవరాజు పాత్రపై విచారణ జరిపినట్లు సమాచారం. ఈ క్రమంలో విధి నిర్వహణలో నిబంధనలను పాటించలేదన్న కారణంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు డీఐజీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కణేకల్లు సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అధికారిపై సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడటంతో రిజిస్ట్రేషన్ల శాఖలో చర్చనీయాంశంగా మారింది. వీరాపురం గ్రామానికి సంబంధించిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో మరిన్ని వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి కారణాలు, తదుపరి శాఖాపరమైన చర్యలపై అధికారికంగా మరింత సమాచారం వెలువడాల్సి ఉంది.

## పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించడంపై దృష్టి పెట్టాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా.. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున రెడ్డి, కిరణ్మయి, ఆనంద్, డీఎం సివిల్ సప్లైస్ రమేష్ ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 591 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అందులో రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించి 269 అర్జీలు, ఇతర అర్జీలు 322 రావడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి పెండింగ్ ఉంచరాదన్నారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్జీల పరిష్కారంపై నిత్యం మానిటర్ చేయాలని ఆదేశించారు. క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ బాలాజీ నాయక్, డిటిసి వీర్రాజు, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్చంద్, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిసిఓ అరుణకుమారి, డిఎంహెచ్ఓ డా.కె.వెంకటేశ్వర్లు, డీఎస్ఓ శోభారాణి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి శైలజ, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, జిఎస్డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, ఏపిఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస యాదవ్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వజనాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



- అన్ని వార్డులు, ఓపి విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే
- ఓపి సేవల్లో హెచ్ఓడిలు లేకపోవడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి అసంతృప్తి
- ఇదే అంశంపై సూపరింటెండెంట్ ను వివరణ కోరిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- వైద్యులు వైద్య సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
అనంతపురం జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇవాళ ఉదయమే ఆసుపత్రికి వెళ్లి అన్ని విభాగాల వార్డులను సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడి వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అలాగే అన్ని ఓపి విభాగాలను కూడా ఆయన పరిశీలించారు. అక్కడ క్యూలైన్లలో ఉన్న ప్రజలతో మాట్లాడారు. అయితే ఓపి సేవలో హెచ్వోడీలు లేకపోవడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సూపరింటెండెంట్‌ను వివరణ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మొత్తం 560 పడకల మాత్రమే ఉన్నాయని.. కానీ ఇక్కడ ఇన్ పేషెంట్లు 1200 మందికి పైగా ఉన్నారన్నారు. ప్రతిరోజు 2000 నుంచి 2300 వరకు ఔట్ పేషెంట్లు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారన్నారు. సోమవారం రోజు 3వేల మంది వరకు కూడా ఇక్కడికి వస్తున్నారన్నారు. జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా వైద్య సేవలు కోసం వస్తున్నారన్నారు. దీనివలన ప్రస్తుతం ఉన్న సిబ్బంది అలాగే సౌకర్యాలు సరిపోవడం లేదని ఇదే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రిని పట్టించుకున్న దాఖలాలు లేవని తాము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ నిధులతోపాటు సిఎస్ఆర్ ఫండ్స్ తో ఇక్కడ మదర్ మిల్క్ బ్యాంక్ వంటివి ఏర్పాటు చేశామన్నారు. గతంలో మదర్ మిల్క్ బ్యాంక్ తిరుపతి, కాకినాడ లో మాత్రమే ఉండేదని.. కానీ ఇప్పుడు అనంతపురంలో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్ రాష్ట్రంలోని అగ్రగా మిగా ఉందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్యంపై కూడా తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అయితే ఇక్కడ సిబ్బంది కొరత వలన ఇలాంటి సమస్య ఉందని, దీనిని త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ మల్లీశ్వరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు చదువుతోపాటు మంచి ఆరోగ్యం అవసరం

- ఈనెల 25న జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- అక్టోబర్ 05 తేదీ మాప్ అప్ రోజున ఆల్బెండజోల్ మాత్రను చప్పరించి, మింగేలా చర్యలు తీసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**అనంతపురం, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
పిల్లలకు చదువుతోపాటు మంచి ఆరోగ్యం కూడా చాలా అవసరం అని, విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25న చేపట్టిన జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమమును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురము కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ నందు ఈ సెప్టెంబర్ నెల 25న జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే) నిర్వహణపై సంబంధిత అధికారులతో జేసి సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత బ్యానర్ ను, గోడ పత్రికలన డిఆర్ఓ ఎ.మలోల, డిఎంహెచ్ఓ డా.కె.వెంకటేశ్వర్లు, తదితర అధికారులతో కలిసి జేసీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమం ముందస్తుగా అందేలా చూడాలని, అలాగే జిల్లాలో ఈనెల 25వ తేదీన అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియట్, ఒకేషనల్, అంగన్వాడి, తదితర కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన తర్వాత 1-2 సం.లోపు పిల్లలకు చప్పరించే ఆల్బెండజోల్ 400 ఎం.జి మాత్రలో సగం, 2-19 సం.ల లోపు వారికి మింగించాలన్నారు. నులిపురుగుల బారిన పడకుండా శారీరక, మానసిక ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెంపొందాలన్నా పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు పిల్లల ఎదుగుదల మీద తీవ్రమైన ప్రభావం చూపుతాయని, దీని వల్ల పోషకాహార లోపం ఏర్పడుతుందని, అంతేకాకుండా రక్తహీనత, ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఇలాంటి పరిస్థితులను పిల్లలకు దూరం చేసి నులిపురుగులను నిర్మూలించి మంచి ఆరోగ్యంగా ఉండేందుకు అల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 2 సం.పైన నుండి 19 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలలకు 400 ఎం.జి. మాత్రలు, 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర అనగా 200 ఎం.జి ట్యాబ్లెట్ భోజనం చేసిన తరువాత చప్పరించి మింగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పిల్లలు, కిషోర బాలల కడుపులో నులి పురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల చప్పరించే మాత్రలను సంబంధిత విద్యా సంస్థలకు ముందస్తుగా అందేలా చర్యలు తీసుకావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యాప్తంగా 5,99,852 మంది 1- 19 సం.ల విద్యార్థినీ విద్యార్థులు అంగన్వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బడి బయటి పిల్లలు, బడి బయట కౌమార దశలో పిల్లలు, ఐటిఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, నర్సింగ్, డిగ్రీ ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలోని వారు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంటుందని, దానికి అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, డివిఈఓ, డిఎంహెచ్ఓ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి తదితర సంబంధిత అధికారులను అప్రమత్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. డిఎంహెచ్ఓ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ మాత్రలను అన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు తదితర విద్యా సంస్థలకు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ అందరూ ఎంపిడిఓలకు ఆదేశాలు ఇచ్చి ఈ కార్యక్రమ అమలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున ఏదేని కారణం చేత డీ-వార్మింగ్ చేయబడని పిల్లలకు మరలా అక్టోబర్ 05న మాప్ అప్ రోజున ఆల్బెండజోల్ మాత్రను చప్పరించి, మింగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం నందు జడ్పీ సీఈవో విజయ లక్ష్మి, డీఈఓ అయూబ్ హుస్సేన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సి.సాజిదా బేగం, ఆర్బీఎస్కే ప్రోగ్రాం ఆఫీసర్ డా.విష్ణుమూర్తి, మేనేజర్ రజిత, డివిఈఓ గురవయ్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్ఐఓ వెంకట రమణ నాయక్, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు..

- 26న పుట్టపర్తిలో వైద్య శిబిరం..
- ఆధార్, గుర్తింపు కార్డు తప్పనిసరి..
- నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలకూ అవకాశం



**పుట్టపర్తి, సెప్టెంబర్ 21, దరువు న్యూస్ :**
జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల అభ్యర్థన మేరకు జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఈ నెల 26న పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో జర్నలిస్టులకు అందించనున్న వైద్య సేవలపై చర్చించారు. శిబిరంలో హెచ్‌బీ, సీబీసీ, బీపీ, ఎఫ్‌బీఎస్, పీపీఎస్, ఈసీజీ, ఎల్‌ఎఫ్‌టీ, ఆర్‌ఎఫ్‌టీ, మూత్ర పరీక్షలు, రక్త సంబంధిత పరీక్షలు, జీవరసాయన పరీక్షలు, సంపూర్ణ మూత్ర పరీక్షలు, కొవ్వు పదార్థాల పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మహిళల కోసం పింక్ బస్ సేవల ద్వారా నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. ఈనెల 26న పుట్టపర్తిలోని సాయి ఆరామానికి హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తాము పనిచేస్తున్న సంస్థ గుర్తింపు కార్డు లేదా అక్రిడిటేషన్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు పొరకలవన్నప్ప, ఏపీబీజేఏ అధ్యక్షుడు చలపతి, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.